# రిజర్వేషన్లు - పుట్టు పూర్వోత్తరాలు

దేశంలో మారుతున్న ఆర్థిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో రిజర్వేషన్ల సమస్యపై తీవ్రమైన ఆందోళనలు, చర్చలు జరుగుతున్నాయి. ఒకవైపు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కావాలని, మరోవైపు అగ్రకులాలకు కూడా రిజర్వేషన్లు కల్పించండి లేదా రిజర్వేషన్లు ఎత్తేయండనే డిమాండ్‌తో ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లను చారిత్రకంగా పరిశీలించడం అవసరం.

### ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అవసరం ఏమిటి?

మన రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సంస్థలన్నింటిలో రిజర్వేషన్లు అమలు చేయాలి. 1990లో నుండి అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణల వలన ప్రభుత్వరంగం దాదాపు ప్రైవేటుపరం చేయబడింది. లేదా మూసివేయబడింది. మిగిలిందీ త్వరలో అంతం అవుతుంది. ఇండియన్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే ప్రకారం 2004-2005లో ప్రభుత్వ ఉద్యోగాలు 15.3% ఉండగా 2011-2012 నాటికి 11.7%కి తగ్గిపోయాయి. ఈనాటికి వచ్చేటప్పటికి భారీగా తగ్గిపోయి ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో టెక్నాలజీ కారణంగా ఉద్యోగ అవకాశాలు తగ్గడమే గాక కాంట్రాక్టు/ అవుట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగులను నియమిస్తున్నారు. రిజర్వేషన్లు అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులు, ప్రభుత్వ రంగంలో వస్తున్న ఈ మార్పులు వలన రిజర్వేషన్లు నామమాత్రంగా మారిపోతున్నాయి. పరిశ్రమలు, సర్వీసులన్నీ ప్రైవేటు రంగానికి తరలిపోతున్న నేపథ్యంలో ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయకపోతే అణగారిన తరగతులు (కులాలకు) ఉపాధి దొరికే అవకాశమే లేదు.

ఒకవైపు ప్రభుత్వ రంగాన్ని, సర్వీసులను ప్రైవేటు పరం చేస్తున్న పాలక వర్గాలు మరోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. యూనివర్శిటీల్లో ప్రొఫెసర్లు దగ్గర నుండి పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల వరకు ఖాళీలు నింపడం లేదు. అన్ని విధాల ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసి ఆర్థికంగా వెసులుబాటు ఉన్నవాళ్లని ప్రైవేటు విద్యారంగం వైపు మళ్లిస్తున్నారు. ఇక ప్రభుత్వ విద్యారంగంలో మిగిలింది దళితులు, గిరిజనులు, బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన వారే, ఈ సామాజిక తరగతులకు నాణ్యమైన విద్యే లేదు.

అసలే అణచివేతకు గురయ్యే సామాజిక తరగతులు నాణ్యమైన విద్యలేని కారణంగా  అన్ని అవకాశాలు ఉన్న అగ్రకులాల సామాజిక తరగతులతో ప్రైవేటు

రంగంలో పోటీపడి ఉద్యోగం సంపాదించడం అసాధ్యం. స్వాతంత్ర్యనంతరం రిజర్వేషన్ల వలన ఏదో కొంత ఉద్యోగ, ఉపాధి పొందిన అణగారిన సామాజిక తరగతులు స్వాతంత్ర్య పూర్వస్థితికి మరల నెట్టివేయబడడం ఖాయంగా గోచరిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయమని ఆందోళన ప్రారంభమైంది.

## ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయాలంటే?

ప్రభుత్వ ఆర్థిక సహకారం ఉన్న అన్ని సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యాంగ ఆదేశం. నేడు ప్రైవేటు రంగంలో ఉన్న పెట్టుబడిలో నూటికి 90శాతం ప్రజలది, ప్రభుత్వానిదే. ఉదాహరణకు 100కోట్లు నిజాం షుగర్ ఫ్యాక్టరీ బొబ్బిలి యూనిట్‌ను 20కోట్లకు ఎన్‌సిఎస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి 2002లో చంద్రబాబు ప్రభుత్వం అమ్మేసింది. ఆ 20 కోట్లలో 18 కోట్లు బ్యాంకుల నుండి అప్పు తీసుకుని ఎన్‌సిఎస్ కొనేసింది. ఆ తరువాత ఆ కంపెనీ ఆస్థులను చూపించి బ్యాంకుల నుండి 385 కోట్లు అప్పు తీసుకుంది. ఇందులో అసలు ప్రైవేటు పెట్టుబడి ఉందా? కంపెనీ పెట్టుబడి అంతా ప్రభుత్వానిదే. బ్యాంకుల్లో డబ్బంతా ప్రజలదే. కంపెనీ మాత్రం ప్రైవేటుది. ప్రభుత్వ ఆస్థిని ప్రైవేటు కంపెనీకి రాసి ఇచ్చేయడమే.

అలాగే వాజపేయి ప్రభుత్వం 5000 కోట్ల ఆస్థులు గల భారత్ అల్యూమినియం కంపెనీని 550 కోట్ల రిజర్వు ఫండ్సుతో సహా 500 కోట్లుకు స్టెరిలైట్ కంపెనీకి అమ్మేసింది. హిందూస్థాన్ జింక్‌తో సహా భారత దేశంలో ప్రభుత్వ పరిశ్రమలన్నింటికీ ప్రైవేటు కంపెనీలు ఇదే విధంగా యాజమానులవుతున్నారు. ఇవన్నీ ప్రజాధనంతో నిర్మించబడి మన ప్రజాధనంతో నడుస్తున్నప్పుడు భారత రాజ్యాంగం ప్రకారం వీటిల్లో ఎందుకు రిజర్వేషన్లు అమలు జరపకూడదు? అందువలన ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కోసం జరుగుతున్న ఆందోళన, పోరాటాలు న్యాయమైనవే.

## మాకూ రిజర్వేషన్లు కావాలని ఎందుకు ఉద్యమిస్తున్నారు.?

దీనికి రెండు కారణాలున్నాయి. ఎన్నికల్లో గెలుపుకోసం రాజకీయ పార్టీలు ఆ సామాజిక తరగతుల ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకుని గెలుపొందేందుకు చేసిన ప్రయత్నాలు. ఉద్యమాల వలన రాజకీయ ప్రయోజనం పొందాలనుకునే దురుద్దేశ్యంతో అదే పాలక వర్గాలు చదుకున్న యువకులను ఉద్యమాలకు ఉసిగొల్పడం మొదటి కారణం.

నిజంగానే ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన స్థితిలో ఉన్న సామాజిక తరగతుల్లో కూడా పేదలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ఈ సామాజిక తరగతి ప్రజల చేతిలో ఉన్న భూమి కూడా ఆవిరై ఎంతో మంది పేదవారిగా మారిపోతున్నారు. వ్యవసాయం గిట్టుబాటు గాక భూమి అమ్మైనా పిల్లలను చదివించుకోవాలనే తపన పెరిగిన రైతులు భూములు అమ్మేసి పిల్లలను

చదివించుకుంటున్నారు. ఈ చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగం, ఉపాధి దొరకడం లేదు. మరోవైపు రిజర్వేషన్ల కారణంగా నష్టపోతున్నారనే తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మాకూ రిజర్వేషన్లు ఇవ్వండి లేక మమ్మల్ని ఎస్సీ/ ఎస్టీల్లో చేర్చండి లేదా రిజర్వేషన్లు తొలగించడనే వైఖరి తీసుకుంటున్నారు.

### కార్పోరేటు మీడియా, బిజెపిలు ఆజ్యం పోస్తున్నాయి.

ఉద్యోగం, ఉపాధి, గౌరవ ప్రదమైన జీవితం లేక యువతీ యువకులు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో కల్గించిన భ్రమలు తొలగిపోతున్నాయి. మోడీ 'మేక్ ఇన్ ఇండియా' చంద్రబాబు 'మేక్ ఇన్ ఆంధ్రప్రదేశ్' ఆశలు ఆవిరైపోతున్నాయి. వాస్తవాలు క్రమంగా ఆవిష్కరించబడుతున్నాయి. తమ దుస్థితికి రిజర్వేషన్లు కాదు ఈ ఆర్థిక విధానాలు వాటి వెనుకున్న దోపిడి శక్తులు, కార్పోరేట్ వర్గాలకు అండగా నిలుస్తున్న పార్టీలు కారణమని తెలుసుకుంటే వచ్చే తీవ్రమైన పరిణమాల నుండి ప్రక్కదోవ పట్టించి వివిధ సామాజిక తరగతుల్లో ఉన్న యువతీ యువకుల్లో అపోహాలు పెంచి అనైక్యతను సృష్టిస్తున్నారు. కార్పోరేట్ మీడియా వక్ర భాష్యాలతో, అసత్యాలతో గందరగోళం సృష్టిస్తున్నది. అగ్రకుల దుర్హంకారం సిద్ధాంతంగా గల మనువాద పార్టీ బిజెపి అధికారంలో ఉండడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. వెరసి చదువుకున్న యువకులను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితిల్లో రిజర్వేషన్ల చారిత్రక క్రమాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరం. వర్తమానంలో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అవసరాన్ని అవగాహన చేసుకునేందుకు మా ప్రయత్నం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాము.

### రిజర్వేషన్ల అమలుకు దారితీసిన పరిస్థితులను వాస్తవంగా విశ్లేషణ చేయాలి.

రిజర్వేషన్ల వ్యతిరేక – అనుకూల ఉద్యమాలు అట్టడుగు వర్గాల్లోని కష్టజీవుల మధ్య పెద్ద చిచ్చును రగుల్చుతున్నాయి. ఉద్యమాలు చల్లబడినా మనసుల్లో నాటుకున్న భావాలు అంత త్వరగా చెరిగిపోవు. కుల దురహంకారం మరింత నగ్నంగా బయట పడుతున్నది. ఇది ప్రజాతంత్ర ఉద్యమానికి, అంతిమంగా వామపక్ష ఉద్యమానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది.

### స్వాతంత్ర్యానికి పూర్వం రిజర్వేషన్ల అమలు

మనదేశంలో రిజర్వేషన్లకు 125 సంవత్సరాల చరిత్ర ఉంది.

జాతీయ ఉద్యమం సాగుతున్న రోజుల్లోనే ఐసిఎస్‌లో కేవలం బ్రిటీష్ వాళ్లకే ప్రవేశం ఉండేది. భారతీయులకు కూడా హక్కు కల్పించాలని బ్రిటీష్ వారిని కోరిన ఫలితంగా మనకు కూడా అవకాశం కల్పించారు.

"1892 – 1904 మధ్య కాలంలో ఇండియన్ సివిల్ సర్వీసెస్ (ఐసిఎస్)కి

16మంది సెలక్ట్ కాగా అందులో 15మంది బ్రాహ్మణులే ఉన్నారు.

"1914 నాటికి 128 మంది జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేటివ్స్ ఎన్నిక కాగా అందులో 93 మంది బ్రాహ్మణులే ఉన్నారు."

1944లో 650 మంది పట్టభద్రులుండగా అందులో 452 మంది బ్రాహ్మణులే." – (ఇఎంయస్ గ్రంథం భారత జాతీయోద్యమ చరిత్ర నుండి)

విద్యారంగంలో ఫీజులో రాయితీల కోసం మనదేశంలోని అనేక వర్గాల వారు బ్రిటీష్ వారికి అర్జీలు పెట్టుకున్నారు. వీరిలో ఎక్కువ మంది ముస్లింలున్నారు. ఇది పరిశీలించడానికి 1882లో బ్రిటీష్ వారు హంటర్ కమీషన్‌ను నియమించారు. కమీషన్ ఒరిస్సాలోని గంజాం జిల్లాలో ముస్లింల విద్యా పరమైన స్థితిగతులను పరిశీలించి ముస్లింలకు ప్రత్యేక సదుపాయాల కోసం1882లో సిఫార్సు చేయడం జరిగింది. అలా ప్రారంభమైన రిజర్వేషన్ల వ్యవహారంలో 1883లో 11 కులాలను, 1893లో 39 కులాలను బిసిలుగా గుర్తించారు. 1913 నాటికి కమ్మ, 1933 నాటికి కాపు కులం కూడా వెనుకబడిన కులాల జాబితాలో చేరాయి. 1943 తరువాత కాపు కులానికి కూడా రిజర్వేషన్లు అమలు చేయడం జరిగింది. 1956లో నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి కాపులకిచ్చిన రిజర్వేషన్లకు తొలగించారు.

1882లో హంటర్ కమీషన ముందు మహాత్మ జ్యోతిరావ్ పూలే శూద్రులకు, దళితులకు విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఉండాలని కోరారు.

కాంగ్రెస్ ఏర్పడిన సంవత్సరంలోనే (1885) మద్రాసు ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు విద్య అందుబాటులోకి తేవడానికి సబ్సిడీ ఇచ్చింది.

దేశంలోనే మొదటిసారి 1895 జూన్‌లో కొన్ని పదవులను వెనుకబడిన వర్గాలవారికి రిజర్వు చేస్తూ సర్క్యులర్ జారీ చేశారు.

1902లో సాహూ మహరాజ్ (మహారాష్ట్ర) కొల్హాపూర్ సంస్థానంలో బ్రాహ్మనేతరులకు విద్యా, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు.

1905లో తమిళనాడులో దక్షిణభారత విముక్తి సమాఖ్య ఏర్పడి, అట్టడుగు కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని పోరాటం చేశారు. ఈ సమాఖ్యయే జస్టిస్ పార్టీగా రూపాంతరం చెందింది.

మద్రాసు ప్రావిన్స్‌లో పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్, జస్టిస్ పార్టీ నడిపిన అనేక పోరాటాల ఫలితంగా కమ్యూనల్ జి.వో ప్రకటించబడింది. ఎస్సీ, ఎస్టీ, క్రిష్టియన్స్‌తో సహా వెనుకబడిన కులాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

1908కి ముందు రాజకీయ రిజర్వేషన్ల కొరకు ముస్లింలు అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారు. మింటో మార్లె సిఫార్సుల మేరకు 1908లో ముస్లింలకు ప్రత్యేక

స్థానాలు కేటాయించబడ్డాయి. దీని ఆధారంగానే డా॥ అంబేద్కర్ దళితులకు రాజకీయ రిజర్వేషన్ల కొరకు పోరాడడం జరిగింది.

1921లో నియమించిన మిల్లర్ కమిటీ మనదేశంలో బిసిలపై నియమించిన మొట్టమొదటి కమిటి. ఆ కమిటి నివేదిక ఆధారంగా మైసూర్ (కర్నాటక) సంస్థానంలోని ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు కల్పించారు.

1935లో ట్రావెన్‌కోర్ సంస్థానం విద్యా, ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు అమలు చేశారు.

1917లో బ్రాహ్మణ వ్యతిరేక పోరాటం ప్రజామిత్ర మండలి పేరుతో మద్రాసులో పెద్ద ఎత్తున సాగింది.

1921లో బ్రాహ్మణ వ్యతిరేకులందరూ సంఘటనగా ఏర్పడి మాకు కూడా ఉద్యోగాలలో అవకాశం కల్పించాలని, ఎక్కువ మందిని తీసుకోవాలని డిమాండ్ చేయగా బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగింది.

1927లో మద్రాసు రాష్ట్రంలో అట్టడుగు కులాలవారిని 5 తరగతులుగా విభజించి, వారికి కోటాలు కేటాయించడం జరిగింది.

మద్రాసు తరహాలోనే మైసూర్ రాష్ట్రంలో రిజర్వేషన్లు కల్పించాలని బ్రాహ్మణ వ్యతిరేకులంతా ఆందోళన చేయగా రిజర్వేషన్లు కల్పించడం జరిగింది.

మన దేశంలో 1919లో మాంటేగ్, చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల ఫలితంగా ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం జరిగింది.

1920లో గాంధీ అంటరాని కులస్థులను హరిజనులుగా నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ పదాన్ని ప్రభుత్వం నిషేధించింది.

**పూనా ఒప్పందం :** 1932 ఏప్రిల్ నెలలో రామ్సే మెక్‌డొనాల్డ్, అంబేద్కర్ కృషి ఫలితంగా కమ్యూనల్ అవార్డును ప్రకటించారు. ఈ ప్రకటనలో దళితులకు, సిక్కులకు, క్రైస్తవులకు విడివిడిగా నియోజకవర్గాలు కేటాయించారు. దళితులకు 71 నియోజకవర్గాలు కేటాయించారు. ఈ ఒప్పందాన్ని గాంధీ వ్యతిరేకించి ఎరవాడ జైలులో ఆమరణ నిరాహారదీక్ష చేశారు. ఆ సందర్భంగా గాంధీ – అంబేద్కర్ మధ్య పూనా ఒప్పందం జరిగింది. దీని ప్రకారం దళితుల స్థానాలు 71 స్థానాల నుండి 144కు పెరిగాయి.

1947లో స్వాతంత్ర్యం వచ్చింది.

**రాజ్యాంగం అమలు :** రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయాలి? అని డా॥ బి.ఆర్.అంబేద్కర్ ప్రశ్నించి ఈ క్రింది విధంగా జవాబు చెప్పారు.

1. నేటికి కొనసాగుతున్న కుల వివక్షను అధిగమించాలంటే రిజర్వేషన్లు అమలు చేయాలి.

2. చారిత్రకంగా జరిగిన తప్పిదాన్ని సవరించాలన్నా రిజర్వేషన్లు చాలా

కాలంపాటు అమలు చేయవలసి ఉంటుంది.

రిజర్వేషన్లు ఊత కర్రల్లాంటివి. వీటివలన తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలుగుతుంది. సంపదలో అందరికీ భాగస్వామ్యం కల్పించినప్పుడు మాత్రమే రిజర్వేషన్ల అవసరం తీరుతుంది.

**1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చింది. సామాజిక వివక్ష ఆధారంగానే రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. నేటికీ దేశంలో ప్రతి సంవత్సరం దళితులపై దాడులు, మానభంగాలు విస్తృతంగా జరుగుతూనే ఉన్నాయి. 1985లో దళితులపై 20 వేలకు పైగా దాడులు జరిగితే 2012 నాటికి 35 వేలకు, 2014 నాటికి 47,064కు దాడులు జరిగాయి. దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. సామాజిక వివక్ష నేటికీ కొనసాగుతుందని అగ్రకులాల వారికి అర్థం కావడంలేదా?**

రాజ్యాంగంలో 15(1) పౌరుల పట్ల ప్రభుత్వం, జాతి, మత, లింగ, కుల ప్రాతిపదికమీద వివక్ష పాటించడానికి వీలులేదు.

16 (1) ఏ ప్రభుత్వ ఉద్యోగం విషయంలోనైనా, పదవి విషయంలో నైనా పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. (2) పౌరులెవ్వరినీ కూడా జాతి, కుల, మత, లింగ, వంశ, ప్రాంతాల ప్రాతిపదిక మీద ప్రభుత్వ ఉద్యోగాలకు గానీ, పదవులకు గానీ అనర్హులుగా భావించకూడదు, వివక్ష పాటించకూడదు.

మద్రాసు ప్రభుత్వం 1948లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం తీసుకువచ్చింది. దానిపై 1950లో శ్రీమతి చంపకం దొరైరాజన్ - శ్రీనివాస్ ఇద్దరూ రాజ్యాంగంలోని 15(1) ఆర్టికల్ ప్రకారం రిజర్వేషన్లు సరికావని హైకోర్టులో పిటీషన్ వేయగా, హైకోర్టు దొరై రాజన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. మద్రాసు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు నివేదించగా సుప్రీం కోర్టు కూడా ఈ తీర్పే ఇచ్చింది.

**అప్పుడు పార్లమెంటు ఏకగ్రీవంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం ఆమోదించడం జరిగింది.**

15 (4) ప్రకారం షెడ్యూల్ కులాలు, తెగలు లేక సామాజికంగానూ, విద్య పరంగానూ వెనుకబడ్డ వర్గాల పురోగమనం కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చని రాజ్యాంగంలో పొందుపర్చడం జరిగింది.

16 (4) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో, పదవుల్లోనూ తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించవచ్చు.

29 (1) ప్రకారం ప్రభుత్వం నిర్వహించే లేక ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే ఏ విద్యా సంస్థలో నైనా ఒక వ్యక్తికి మతం, జాతి, కులం లేక భాష కారణంగా ప్రవేశం నిరాకరించడానికి వీలు లేదు.

1950లో కేరళలో రిజర్వేషన్ల విషయమై పెద్దఎత్తున ఆందోళన కొనసాగింది.

అప్పుడు ఇఎంయస్ నంబూద్రిపాద్ అధ్యక్షతన కమిటీ ఏర్పడింది.

**"ఎస్సీ, ఎస్టీలకు కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించొచ్చు. బిసిలకు మాత్రం కొన్ని కులాలను సామాజికంగా వెనుకబడిన కులాలుగా పరిగణించినా కొన్ని కులాలకు ఆర్థిక ప్రాతిపదికమీద రిజర్వేషన్లు కల్పించాలనిఈ కమిటీ సూచించింది."**

దీంతో బిసి నాయకులంతా రిజర్వేషన్‌లలో మాకెందుకు ఆర్థిక ప్రాతిపదిక అని ఆందోళన చేయగా అగ్ర కులాలవారు బిసిలకు రిజర్వేషన్లు ఎందుకు? అని రెండువైపులా ఇఎంయస్ నంబూద్రిపాద్ కమిటీపై దాడి చేశారు.

బిసిలకు రిజర్వేషన్ల విషయమై1967లో యన్. దామోదరన్ కమిటీ వేయగా 1969లో ఈ కమిటీ ఇఎంయస్ ప్రతిపాదనలు సమర్థిస్తూ నివేదిక ఇచ్చింది.

**1951 జనవరి 29న కాకా కలేల్కర్ కమిటీ ఏర్పాటు :** బిసి కులాల్లోకి ఎవరొస్తారో ఎలా గుర్తించాలి? అనే దానిపై పార్లమెంటులో పెద్ద చర్చ జరిగింది. ఆ సందర్భంగా నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంటులో మాట్లాడుతూ బిసిలుగా గుర్తించడానికి 340 ఆర్టికల్ ప్రకారం కాకా కలేల్కర్ (ఎం.పి అధ్యక్షతన) 11 మంది సభ్యులతో కమీషన్ వేసారు.

1955లో కమీషన్ నివేదిక ఇచ్చింది. కానీ కమీషన్ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. **2,399 కులాలను బిసి కులాలుగా గుర్తించారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలంటే సామాజిక వెనుకబాటు తనాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలని వీరు సూచించారు.**

ఈ కమిటీ వెనుకబడిన కులాలను 2 తరగతులుగా, వెనుకబడిన కులాలు, బాగా వెనుకబడిన కులాలుగా విభజించింది.

ఏకగ్రీవంగా సూచనలు చేయకపోవడంతో ఈ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు చేయబడ్డాయి.

**రీసెర్చ్, న్యాయవ్యవస్థ, రక్షణ, ప్రభుత్వ సెక్రటేరియట్, ఈ నాలుగింటిలో ఇప్పటికీ ఎలాంటి రిజర్వేషన్లు లేవు.**

**మహిళలందరిని** బిసిలుగానే గుర్తించాలని సూచించారు.

బిసిల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదని, రాష్ట్రాల్లోనే తేల్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చుకోవచ్చని కేంద్రం 1961లో సూచించింది.

ఆంధ్రప్రదేశ్‌లో1963లో అనంతరామన్ కమీషన్‌ను వేశారు. ఈ కమీషన్ సమగ్రంగా విచారించి 1970లో రిపోర్టు ఇచ్చింది. బిసిలకు రిజర్వేషన్లకు కులాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలని, వీరికి 30 శాతం రిజర్వేషన్ కల్పించవచ్చుని సిఫార్సు చేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం మాత్రమే ఇచ్చింది. దీనిని 1975 తరువాత అమలు చేశారు.

1982లో అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మురళీధరరావు కమీషన్‌ను వేశారు. ఈ కమీషన్ బిసిలకు 44 శాతం రిజర్వేషన్లు ఇవ్వవచ్చని సూచించింది. ఎన్.టి.రామారావు ప్రభుత్వం అమలుకు ప్రకటన చేసింది. వెంటనే అగ్ర కులాలు పెద్దఎత్తున దాడి చేశాయి. పత్రికలు కూడా రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి మద్దతు పలికాయి. అగ్రకులాలు హైకోర్టుకు వెళ్ళగా హైకోర్టు కొట్టేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకి వెళ్ళలేదు.

మొరార్జీదేశాయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1978 డిసెంబర్‌లో బిసి మండల్ అధ్యక్షతన కేంద్రంలో బిసి రిజర్వేషన్ల నిమిత్తం కమీషన్‌ను వేశారు. 1980లో కమీషన్ నివేదిక ఇచ్చింది.

**1990లో వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఈ కమీషన్ సూచనలు అమలు పరుస్తామని ప్రకటన చేశాడు. మండల్ కమీషన్ సిఫార్సులను అమలు పరిచే సందర్భంగా బిసి తరగతుల్లో క్రిమిలేయర్ పాటించాలని సిపియం పార్టీ సూచించడం జరిగింది. సుప్రీం కోర్టు కూడా బిసిలకు క్రిమిలేయర్ అమలు చేయాలని అభిప్రాయాన్ని వెలిబుచ్చడంతో సిపియం విధానం సరియైనదని రుజువైనది.**

మండల్ కమీషన్ సిఫార్సుల అమలుకు వ్యతిరేకంగా బాబ్రీ మసీదు వివాదాన్ని ముందుకు తెచ్చి, బిజెపి వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చేసింది.

మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేసేటప్పుడు బీహార్‌లో కర్పూరీ ఠాకూర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఒక ఫార్ములా రూపొందించారు. అది కర్పూరీ ఠాకూర్ ఫార్ములాగా దేశంలోనే నిలిచింది.

**కర్పూరీ ఠాకూర్ సూచనలు :** (1) బాగా వెనుకబడిన కులాలు (కుల ప్రాతిపదిక), (2) సామాజిక వెనుకబాటు, (3) విద్యా పరంగా వెనుకబాటు,(4) ఆర్థిక వెనుకబాటు. ఈ విధంగా వర్గీకరించి అమలు చేయడం జరిగింది. కానీ రిజర్వేషన్లు 50 శాతం దాటి ఉండకూడదని సుప్రీంకోర్టు చెప్పిన మేరకు బిసిలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 22.5 శాతం, బిసిలకు 27 శాతం కలిపితే 49.5 శాతం అయింది.

**నేటికీ కోటా ప్రకారం రిజర్వేషన్లు అమలు కావడం లేదు:** దేశంలో అన్ని ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీలకే లభిస్తున్నాయి. మాకు ఉద్యోగాలు రావడం లేదని అగ్రకులాల్లోని కొంత మంది గగ్గోలు పెడుతున్నారు. వీరి వాదనలకు వాస్తవానికి చాలా తేడా ఉన్నదని 2012లో నాటి మంత్రి నారాయణ స్వామి పార్లమెంటులో చెప్పిన ఈ క్రింది లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

"కేంద్రంలో 149 మంది కార్యదర్శి స్థాయి అధికారులు ఉండగా అందులో ఏ ఒక్కరూ ఎస్సీ కులస్తులు లేరని, నలుగురు మాత్రమే ఎస్టీ కులస్తులు ఉన్నారని" తెలిపారు.

"సివిల్ సర్వీసెస్‌లో ఐఏఎస్, ఐపిఎస్, ఐ.ఎఫ్.ఎస్., పదవులు పరిశీలిస్తే 3,251 మంది ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లు రిక్రూట్ కాగా అందులో 13.9 శాతం దళితులు, గిరిజనులు 7.3 శాతం, ఇతర వెనుకబడిన తరగతులు 12.9 శాతం మాత్రమే ఉన్నారు. అనగా వీరికి కేటాయించిన రిజర్వేషన్లు కూడా పూర్తిగా అమలు కావడం లేదు. మిగిలిన ఉద్యోగాలన్నీ అగ్ర కులాల వారే కాజేస్తున్నారు. దేశంలో 73 ప్రభుత్వ శాఖల్లో ఎస్సీలకు కేటాయించిన 35,000 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు నింపకుండా ఖాళీగా ఉన్నాయి. 4,518 ఉద్యోగాలలో ఎస్సీలకు ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా ఆపేశారు. అదే విధంగా గిరిజనులకు 28,173 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి" అని మంత్రి నారాయణ స్వామి గారు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగులను పరిశీలిస్తే గ్రూపు 'ఎ' ఆఫీసర్లలో దళితులు కేవలం 11.1 శాతం ఉండగా గిరిజనులు 4.6 శాతం మాత్రమే ఉన్నారు. గ్రూపు 'బి'లో దళితులు 14 శాతం ఉండగా గిరిజనులు 5.5 శాతం ఉన్నారు. గ్రూపు 'సి'లో ఎస్సీలు 16 శాతం ఉండగా ఎస్టీలు 7.8 శాతం ఉన్నారు. గ్రూపు 'డి'లో ఎస్సీలు 19 శాతం ఉండగా గిరిజనులు 7 శాతం ఉన్నారు. గ్రూపు 'డి'లో ఎందుకు ఎక్కువ మంది ఎస్సీ ఉద్యోగులు ఉన్నారని పరిశీలిస్తే 40 శాతం ఉద్యోగాలు కేవలం సఫాయీ కర్మచారీ ఉద్యోగాలే. అనగా మలమూత్రాలు ఎత్తి, రోడ్లను శుభ్రపరిచే ఉద్యోగాలలో మాత్రం దళితులు ఎక్కువ మంది ఉన్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కావున ఈ వివక్షను అంతమొందించాలంటే సామాజిక, ఆర్థిక రంగాలలో దళితులను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. బిసి కులస్థులకు కూడా తీవ్ర అన్యాయం జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వ పరిధిలో వివిధ శాఖల్లో 80,000 ఉద్యోగాలు ఉండగా కేవలం 9,000 మంది మాత్రమే బిసి కులస్థులు ఉన్నారు.

**కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు:** కార్పొరేట్ కంపెనీల్లో బోర్డు మెంబర్లను పరిశీలిస్తే అగ్ర కులస్థులతోనే నిండి ఉన్నాయి. మొత్తం బోర్డు మెంబర్లలో 8,387 మంది 92.6 శాతం అగ్రకులస్థులే ఉన్నారు. ఇందులో 4,037 మంది 44.6 శాతం బ్రాహ్మణులు ఉండగా, 4,167 మంది 46శాతం వైశ్యులు ఉన్నారు. 43 మంది 0.5 శాతం క్షత్రియులు ఉండగా ఇతర అగ్రకులస్థులు 137 మంది 1.5 శాతం ఉన్నారు. వెనుక బడిన తరగతుల వారు 346 మంది 3.8 శాతం ఉండగా, 319 మంది 3.5 శాతం మాత్రమే ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు.

సుప్రీం కోర్టులో 29మంది జడ్జీలు ఉండగా ఒక్క బిసికూడా లేదు. ఎస్సీ ఒక్కరు మాత్రమే ఉన్నారు.

దేశంలో అన్ని రాష్ట్రాల హైకోర్టుల్లో మొత్తం 612 జడ్జీలుండగా 53 మంది

బిసిలు, 38 మంది ఎస్సీలు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో దళితులకు కోర్టుల్లో న్యాయం ఎలా జరుగుతుంది?

## రాష్ట్రాలలో రిజర్వేషన్ల అమలు

తమిళనాడులో 69 శాతం, కర్నాటకలో 80 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

సుప్రీం కోర్టు రిజర్వేషన్లు 50 శాతం దాటివుండకూడదని చెప్పిన దానిపై సుప్రీం కోర్టు న్యాయ మూర్తులే భిన్నమైన వ్యాఖ్యానాలు చేశారు.. కొన్ని రాష్ట్రాల్లో 70%పైగా బిసిలున్నప్పుడు వారి జనాభా ప్రతిపదికగా రిజర్వేషన్లు అమలు చేయాలి తప్ప సీలింగ్ పెట్టడం సరిగాదని జస్టిస్ చిన్నపరెడ్డి, జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్ గారు వ్యాఖ్యానించారు.

దక్షిణాది రాష్ట్రాల్లోనే బిసిలకు రిజర్వేషన్లు ఎక్కువగా అమలు జరుగుతున్నాయి .మండల్ కమిషన్ సిఫార్సులతోనే ఉత్తరాది రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలుకు పూనుకున్నారు.

మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేసినప్పుడు దీని అమలును వ్యతిరేకిస్తూ అగ్ర కులాలవాళ్లు పెద్దఎత్తున ఆందోళన చేసి బిసిలకు ఎన్నిసీట్లయితే రిజర్వు చేస్తారో అదనంగా అన్ని సీట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు తలొగ్గి ఆ విధంగానే సీట్లు పెంచాయి. అయినా అగ్ర కులాల ఆందోళన చల్లారలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో ఒబిసిలకు రిజర్వేషన్లు అమలు చేయగా నష్టం ఏమీ జరగలేదు. మరి ఉత్తరాదిలో ఏమి నష్టం జరుగుతుంది?

2009లో ఒబిసిలకు ఎన్నిసీట్లు కేటాయించారో అదనంగా అన్ని సీట్లు కేటాయించడంవల్ల 17 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది.

**జస్టిస్ చిన్నప్పరెడ్డి కమీషన్ :** కర్ణాటకలో బిసిలకు రిజర్వేషన్ల నిమిత్తం ఒక కమీషన్ వేసింది. దీనికి ఛైర్మన్‌గా జస్టిస్ చిన్నపురెడ్డి అధ్యక్షతన ఐదుగురు న్యాయమూర్తులతో కమిటీ వేయడం జరిగింది.

తరతరాలుగా అట్టడుగున వున్న వెనుకబడిన కులాలు, చేతివృత్తిదార్లు సామాజికంగా సాంస్కృతిక పరంగా, ఆర్థికంగా వెనుకబడి వున్నారు. వీరిని సమాజంలో సమానత్వం సాధించడానికి రిజర్వేషన్లు కొంతవరకు దోహదపడతాయి. సమానత్వం సాధించడానికి ప్రజాస్వామ్యబద్ధమైన సాధనం రిజర్వేషన్ల అమలు మాత్రమే అని చిన్నప్పరెడ్డి కమిటీ చెప్పింది.

మనదేశంలో ప్రైవేటురంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని దేశంలో వామపక్ష పార్టీలు, దళిత సంఘాలు కోరుతున్నాయి. యుపిఏ -1 ప్రభుత్వం ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు పరిశీలిస్తామని ప్రకటించడం జరిగింది. వెనువెంటనే కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ అధ్యక్షుడు ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు ఇవ్వడం

కుదరదని తెగేసి చెప్పాడు.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు వద్దని డబ్ల్యూటివో, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ పదే పదే ఒత్తిడి తెస్తున్నాయి. రైతులకిచ్చే సబ్సిడీ ఎత్తివేత చిన్నపరిశ్రమలకు ప్రభుత్వం కల్పించే రాయితీల ఎత్తివేత మొదలగు ఆంక్షలు విధిస్తున్నాయి.

అమెరికాలో ప్రైవేటురంగంలో అన్ని విభాగాల్లో అందరికీ ప్రాతినిధ్యం వచ్చేలా వైవిధ్యాన్ని అమలు చేస్తున్నారు. కానీ మన దేశంలోనే అది అమలుకు వ్యతిరేకిస్తున్నారు.

2004లో నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ ఒక అంశాన్ని పేర్కొన్నాడు. నూతన ఆర్థిక విధానాలు అమలైన తర్వాత మన దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఉత్పత్తిలో అందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్ష వెలుబుచ్చారు. ప్రపంచీకరణ మూలంగా వస్తున్న అనేక అనార్థాలకు ముఖ్యంగా బడుగు దేశాలు, ఆ దేశాల్లోని ప్రజలు కోల్పోతున్న తమ గుర్తింపును పునరుద్దరించాలంటే వారికి భాగస్వామ్యం కల్పించాలి. వారిని ఓదార్చకుండా, వారిని భాగస్వాముల్ని చేయకుండా ఆర్థిక ప్రజాస్వామ్యం మనజాలదని అందుకే సాంస్కృతి వైవిధ్యాన్ని లోతుగా పరిశీలించాలని చెప్పారు.

సామాజికంగా, సాంస్కృతికంగా బహిష్కరణకు గురైన వర్గాలు, సమూహాలు కొన్ని అవకాశాలను కోల్పోతారని అవి మనిషిగా సామర్థ్యాన్ని కుంటు పరుస్తాయని అమర్త్యసేన్ పేర్కొన్నారు. సామాజిక బహిష్కరణల మూలంగా సామర్థ్యాన్ని కోల్పోయిన వ్యక్తులు పేదరికాన్ని జయించలేరు. అదేవిధంగా ఆర్థికాభివృద్ధిలో భాగస్వామ్యం కాలేరు. దీనివలన దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. ఇదే సందర్భంలో సాంస్కృతిక, సామాజిక వైవిధ్యం మూలంగా చాలా అనర్థాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తే అభివృద్ధి కుంటుపడుతుందనే చెప్పే మేధావులు అమర్త్యసేన్ చెప్పినదానిని పరిశీలించడం అవసరం. దేశంలో జరుగుతున్న అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కాకపోవడం పెట్టుబడిని ప్రజాస్వామీకరించకపోవడమే కదా.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో ఏ ఒక్క పెట్టుబడిదారుడి వద్ద భారీ పరిశ్రమలు పెట్టే స్తోమత లేదు. అదే విధంగా నాటి ప్రధానమంత్రి నెహ్రూ పెట్టుబడులు పెట్టమని పశ్చిమదేశాల చుట్టూ తిరిగినా పెట్టుబడులు రాలేదు. అటువంటి పరిస్థితుల్లో నాటి సోవియట్ యూనియన్ (కమ్యూనిస్టు దేశం) పారిశ్రామీకీకరణకు సహకరించింది. తద్వారా మనదేశంలో ప్రభుత్వ రంగం ఏర్పడింది. ప్రభుత్వరంగం ద్వారా మనదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. తద్వారా ప్రభుత్వరంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు లభించగా మనదేశంలో పెట్టుబడిదారులు వేలకోట్ల రూపాయలను సమకూర్చుకున్నారు. ఒక్క ఉదాహరణ చూస్తే 1955లో ధీరుబాయ్ అంబానీ పెట్రోల్ బంకులో బాయ్‌గా పనిచేసేవాడు. 1960 ప్రాంతంలో అంబానీ

పెట్టుబడి 50వేల రూపాయలు. సరళీకరణ విధానాలు అమలు చేసే నాటికి 75వేల కోట్ల రూపాయలకు పెరిగింది. 1990 అనంతరం వారి సంపాదన అతి వేగంగా పెరిగి నేడు ఇద్దరు అన్నదమ్ముల ఆదాయం కలిపి దాదాపు 3 లక్షల కోట్లకు చేరింది. ఇదే కాలంలో దేశంలో దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన ప్రజలు శ్రమజీవుల ఆదాయాలు కుదించుకుపోయాయి. మన దేశంలో సంస్కరణల వల్ల అగ్రకులాల్లోని కొద్దిమంది పెట్టుబడిదారులు రాజకీయాల ఆధారంగా ప్రభుత్వ సహకారంతో వేలకోట్లకు రూపాయలకు పడగలెత్తారు.

అమెరికాలో సరళీకరణ విధానాలు అమలైన తర్వాత అన్ని జాతులవారిని భాగస్వాములను చేయడం జరిగింది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం 15 మందికంటే ఎక్కువ మంది పనిచేసే ఏ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లోనూ వివక్ష ఉండకూడదు. నల్లజాతివారికి, ఆసియన్స్‌కు, హిస్పానిక్ వంటి జాతులకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రీజనబుల్ ఎకామ్‌డేషన్ ఇవ్వాలి. రీజనబుల్ ఎకామిడేషన్ అంటే మన భాషలో రిజర్వేషన్లు మాత్రమే. అమెరికాలో తమ వ్యాపారాల్లో వివిధ జాతులకు భాగస్వామ్యం కల్పిస్తూ సమాన ప్రతిపత్తి కల్పించే ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నది. అందుకు తగ్గ చట్టాలను కూడా రూపొందించింది. మరి అమెరికాను ఆదర్శంగా తీసుకుంటున్న మనదేశం ఈ విధానాన్ని ఎందుకు ఆదర్శంగా తీసుకోదు?

### ప్రతిభ దెబ్బతింటుంది అనే వాదన

ప్రతిభ గూర్చి జస్టిస్ చిన్నపరెడ్డి ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించారు. "ప్రతిభ అనేది మనిషి పుట్టుక మీద కాకుండా చుట్టూ వున్న పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. వారికున్న అవకాశాలు బట్టి వారి సామర్థ్యం అభివృద్ధి చెందుతుంది. అంతే తప్ప కులాన్ని బట్టి సామర్థ్యం ఉండదు. సామర్థ్యం దెబ్బతింటుంది అనే వాదన కేవలం అగ్ర కులాలవారికే సామర్థ్యం ఉన్నట్టు మిగిలిన వారికి లేనట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది సరిగాదని చెప్పాడు.

ఒక అట్టడుగు కులంలో, ఒక కుటుంబంలో ఐదుగురు బిడ్డలుంటే, ఐదుగురూ ఆ గుడిసెలోనే జీవిస్తూ ఉంటే, వారి చదువు ఏ విధంగా సాగుతుంది. అగ్ర కులాల్లో పుట్టిన బిడ్డలకు చదువుకోవడానికి అనేక అవకాశాలున్నాయి. ఆ అవకాశాల్ని అందిపుచ్చుకొని వారు బాగా చదువుతారు. వీరు పరీక్షల్లో 80 శాతం మార్కులు తెచ్చుకున్నా పూరి గుడిసెలో ఉండి 50 శాతం మార్కులు తెచ్చుకున్నా అట్టడుగు కులాల వాళ్ళకే ప్రతిభ ఉన్నట్టు లెక్కించాలి. ఇటువంటి అవకాశమే అట్టడుగు కులాలవారికి కల్పిస్తే అగ్ర కులాలతో సమానంగా పోటీ పడగలరు. అని **మండల్** వాఖ్యానించారు.

మన దేశంలో అట్టడుగు కులాలవాళ్ళే ఆర్థికంగా వెనుకబడినవారు. కులానికి ఆర్థిక పరిస్థితికి సంబంధం లేదు. కావున సామాజిక స్థితి, ఆర్థిక స్థితి మార్పు చెందాలంటే కచ్చితంగా రిజర్వేషన్లు అమలు చేయాలి.

2006 మే 22న "హిందూ దినపత్రికలో" పట్టణాల్లో అగ్ర కులస్థులు 25.3 శాతం డిగ్రీలు చదివారు. కానీ ఒబిసీలలో 8.6 శాతమే చదివారు. బిసిల జనాభాతో పోలిస్తే 44 శాతం తక్కువ. ఒసిల జనాభాతో పోలిస్తే 64 శాతం ఎక్కువ. ఈ అంతరాలను తగ్గించాలంటే రిజర్వేషన్లు అమలు చేయడం ఒక్కటే మార్గం.

ప్రయివేటు వృత్తి విద్యా సంస్థలో రిజర్వేషన్లు అమలు చేయనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది.వారు విద్యా వ్యాపారం చేయడం లేదు. వ్యాపకంగా విద్యాసంస్థలను స్థాపిస్తున్నారు. అని చెప్పింది. కానీ వాస్తవం పరిశీలిస్తే అది వ్యాపకం కాదు విద్యను వ్యాపారంగానే చేస్తున్నారు. సుప్రీం కోర్టు కూడా అగ్ర కులాలనే బలపర్చినట్లయింది. ఎం.బి.బి.ఎస్., బి.డి.ఎస్.లో ఎస్.సి., ఎస్.టి.లకు రిజర్వేషన్లు వర్తింపనవసరం లేదని ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చింది.

**దళితులకు, బిసిలకే కాదు. అగ్ర కులంలోని బ్రాహ్మణులకు కూడా తరతరాలుగా రిజర్వేషన్లు అమలవుతున్నాయి.**

(1) గుడిలో పూజారి వృత్తి తరతరాలుగా బ్రాహ్మణులకే రిజర్వు చేయబడింది. వీరు దేశంలో 45 లక్షల మంది ఉన్నారు.
(2) స్వాతంత్ర్యం రాక పూర్వం ఆర్మీలోకి అగ్ర కులాలవారినే తీసుకునే వారు. ఇతరులకు అవకాశం లేదు.
(3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధిక శాతం పదవుల్లో మైనార్టీగా ఉన్న అగ్ర కులాలవాళ్లే ఉంటున్నారు. ఇది వారి జన్మ హక్కుగా భావిస్తున్నారు. మెజారిటీ ప్రజలకు తక్కువ పదవులిస్తున్నారు. మరి దీన్నేమంటారు?

ప్రతిభను కాపాడండి – దేశాన్ని రక్షించండి అనే నినాదంతో రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాలు చేస్తున్నారు.

**ప్రతిభను ఎలా కొలవాలి? :**

(1) పల్లెకు, పట్టణానికి తేడా ఉంది. పల్లెల్లో ప్రభుత్వ స్కూళ్ళల్లో, పట్టణాల్లో కాన్వెంట్లలో చదువుతున్నారు. వీరి విద్యాభ్యాసంలో తేడా లేదా?
(2) అగ్ర కులాల పిల్లలకు పోష్టికాహారం అందుబాటులో ఉంటుంది. అట్టడుగు వర్గాల పిల్లలకు కడుపు నిండా తిండే లేదు. పౌష్టికాహారం ఎక్కడిది?
(3) పట్టణాల్లో చదువుకుంటున్న అగ్ర కులాల పిల్లలకు ట్యూషన్స్ ఉన్నాయి. గ్రామాల్లో పెరుగుతున్న అట్టడుగు పిల్లలకు ట్యూషన్ ఎక్కడిది?
(4) అగ్ర వర్ణాల పిల్లలకు చదువుతో పాటు ఆటల మీద దృష్టి ఉంటుంది. అట్టడుగు వర్గాల పిల్లలు చదువుకోవడం కోసం పనికి పోవాల్సి ఉంటుంది.

ఇన్ని వ్యత్యాసాలు ఉన్న తరువాత ప్రతిభ అంటూ గోల చేయడంలో అర్థం లేదు.

**ప్రతిభకు మార్కులే కొలబద్ద? : –** నేటి విద్యా విధానం, పరిక్షా పద్దతి, విద్యార్థి మేధస్సు మీద కాకుండా, జ్ఞాపకశక్తి ఆధారంగా నడుస్తున్నది. పరీక్షల్లో ఎంత బాగా చదివినా మర్చిపోతే అతనికి మార్కులు రావు. అంటే జ్ఞాపకశక్తి ఉండి ఎక్కువ మార్కులు వస్తే అతనికి ప్రతిభ ఉన్నట్టా?

వీరు కష్టపడుతుంటే, వీరి కష్టాన్ని అప్పణంగా దోచుకొని అగ్ర కులాల్లో కొంతమంది బలిసి పోతూ ప్రతిభ అంటూ గోల పెట్టడం ఏ రకంగా సరైనది?

అట్టడుగు కులాల్లోని బడికి వెళ్ళవలసిన బాలలు బాల కార్మికులుగా తయారవుతుంటే ఈ పరిస్థితికి ఎవరు బాధ్యత వహించాలి? పాలకులుగా ఉన్న అగ్రకుల పెత్తందార్లది బాధ్యత కాదా? దీనిపై వీరు నోరుమెదపరేమి?

**రిజర్వేషన్లు కల్పిస్తే ప్రతిభ పోతుందంటున్నారు : –** మరి అగ్ర కులాల వాళ్ళు లక్షల రూపాయలు క్యాపిటేషన్ ఫీజు కట్టి సీటు కొనుక్కుంటుంటే వారికి ప్రతిభ ఉంటుందా? డబ్బుతో ప్రతిభ వస్తుందా?

(1) అట్టడుగు వర్గాల వాళ్ళు రిజర్వేషన్ల ద్వారా సీటు వస్తే వారుకట్టే డ్యాములు కూలిపోతాయి. వారు ఆపరేషన్ చేస్తే రోగి చనిపోతారు. అని ప్రచారం చేస్తున్నారు. కోట్ల రూపాయలు పెట్టి మెడికల్ సీటు తెచ్చుకున్న అగ్రకుల విద్యార్థి ఆపరేషన్ చేస్తే రోగి బ్రతుకుతాడా? డబ్బుతో వీరి సీటు రిజర్వు చేసుకుంటున్నారు కదా!

(2) క్యాపిటేషన్ ఫీజు కట్టి అర్హత లేకపోయినా డబ్బుతో సీటు కొంటున్నారుగదా! అది అగ్ర కులాలకు రిజర్వేషనే కదా!

(3) ఎన్ఆర్ఐ కోటా క్రింద, మేనేజ్మెంటు కోటా క్రింద కోట్లాది రూపాయలు ఇచ్చి సీట్లు కొనుక్కుంటున్నారు. ఇదికూడా అగ్ర కులాలవారు సీటు రిజర్వు చేసుకుంటున్నట్టే కదా!

**ప్రతిభకు అర్థం ఏమిటి?:**

(1) భూమిని దున్నే పేదరైతు, వ్యవసాయ కూలీ వీరు చేసే పని ప్రతిభ కాదా?

(2) అత్యంత నైపుణ్యంతో బిసి కులస్థులు కళాఖండాలు నిర్మిస్తున్నారు. అది ప్రతిభ క్రిందకు రాదా?

(3) ఇతర దేశాలలో లేని విధంగా మన దేశంలో అగ్గిపెట్టెలో చీరను తయారుచేసి బ్రిటీష్ రాణికి సమర్పించారనేది చరిత్ర. ఇది ప్రతిభ కాదా?

షాంగై జియోటంగ్ యూనివర్శిటీ అత్యున్నత విద్యా విభాగం ప్రపంచంలోని 500 అత్యుత్తమ యూనివర్శిటీల జాబిత రూపొందించింది అందులో 3 మాత్రమే ఇండియాకి చెందినవి ఉన్నాయి. మన దేశంలో యూనివర్శిటీలను అగ్ర కులాలే

నడుపుతున్నాయి గదా? మరి అటువంటప్పుడు మూడే ఎందుకున్నాయి?

రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చ జరుగుతున్నప్పుడు నాటి ప్రధానమంత్రి "మనదేశంలో హిందువులలో 6-10 శాతంగా ఉన్న అగ్ర కులాలే అన్ని రంగాల్లో ఆధిపత్యం వహిస్తున్నారు. అత్యధిక ప్రజలపై తక్కువ మంది పెత్తనం చలాయిస్తున్నారు. మనం సమానత సాధించలేకపోతే, సాధించడానికి ప్రయత్నించకపోతే దేశంలో కులతత్వం పెరిగి పోతుంది. ఆ తరువాత మనం ఎంత మొత్తుకున్నా ఫలితం ఉండదు" అని నెహ్రూ చెప్పాడు.

నేటికీ నెహ్రూ మాటలు మనదేశానికి వర్తిస్తాయిగదా?

మెరిట్ లేని వాళ్ళకు ఉద్యోగాలిస్తే పరిపాలనలో స్థానం కల్పిస్తే దేశం నాశనమవుతుందని గగ్గోలు పెడుతున్నారు. గతంలో మన దేశానికి స్వాతంత్ర్యం కావాలని పోరాడుతున్నప్పుడు బ్రిటీష్ వాళ్లు కూడా ఇదే విధంగా వ్యాఖ్యానించారు. మీకు పాలనలో అనుభవం లేదు. మీకు గనక స్వాతంత్ర్యం ఇస్తే దేశాన్ని నాశనం చేస్తారు అనేవారు. నాడు బ్రిటీష్ పాలకుల వాదనలకు, నేడు అగ్రకుల నాయకుల వాదనలకు ఏ మాత్రం తేడాలేదు.

మనదేశంలో పరిశ్రమలన్నీ అగ్రకులాల చేతిలోనే ఉన్నాయి. మరి అటువంటప్పుడు 8 లక్షల ప్రయివేటు పరిశ్రమలు ఎందుకు మూతపడ్డాయి?

ప్రపంచంలో అతి పెద్దదైన ప్రభుత్వ రంగంలో ఉన్న భారతీయ రైల్వే ప్రతి రోజు 2 కోట్ల 30 లక్షల మందిని తమ గమ్య స్థానానికి చేరుస్తున్నది. రైల్వే రంగంలో ఉద్యోగుల సామర్థ్యాన్ని అధ్యయనం చేసిన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మిచిగాన్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ల బృందం రిజర్వేషన్ల వల్ల సామర్థ్యం తగ్గకపోగా తమకు తాము నిరూపించుకునేందుకు మరింత సమర్థవంతంగా పని చేయడంవల్ల రైల్వేల పనితీరు బాగా మెరుగుపడిందని తేల్చారు.

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ యాక్ట్ -2004 పేరుతో మహారాష్ట్రలో ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలని చట్టం చేశారు. దీనికి ఆర్టికల్ 348 క్లాజ్ 3ని ఆధారంగా చూపారు.

ఇప్పటికే అగ్ర కుల బ్రాహ్మణులు సమాజంలో ఆధిపత్యం చలాయిస్తున్నారు. అట్టడుగు కులాలకు విద్యపై ఎక్కువ ఖర్చుచేసి వారిని అభివృద్ధి చేయాలి అని**స్వామి వివేకానంద** చెప్పారు.

బీహార్ మరియు ఉత్తరాదిలో కులసేనలు, కులం పేరుతో కార్యక్రమాలు జరుగుతున్నాయి. దక్షిణాదిలో కూడా అగ్ర కులాలు వారి కులాల పేరుతో హాస్టల్స్ నిర్వహించారు. అటువంటప్పుడు సామాజికంగా వెనుకబడిన దళితులకు, బిసిలకు

రిజర్వేషన్లు ఇస్తే తప్పేమిటి?

కుల వ్యతిరేక పోరాటం ఆర్థిక సమానతకి సాగే పోరాటం ప్రజాస్వామ్యయుత పోరాటంలో భాగం. ఇది సాధించేవరకు రిజర్వేషన్లు అవసరం.

**బడా పెట్టుబడిదారీ వర్గం దేశ సంపదను** వశం చేసుకొని, గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములతో మైత్రి నెరపుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు, వివిధ సందర్భాల్లో కులాలను రెచ్చగొడుతున్నారు. తద్వారా కులాలను సజీవంగా ఉంచడానికి పాలకవర్గం ప్రయత్నిస్తున్నది. పాలకుల ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు తిప్పికొట్టాలి.

" రిజర్వేషన్లు కేవలం అట్టడుగు వర్గాలవారికి ఉపశమనం మాత్రమే. సామాజిక అసమానతలు పోవాలన్నా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వెనుకబడిన తరగతుల ప్రజలను అభివృద్ధి పర్చాలన్నా భూసంబంధాల్లో మార్పు రావాలి. భూసంస్కరణలు అమలు చేయాలి. ఇది జరగకుండా ఆయా తరగతుల ప్రజల్లో అసమానతలు తొలగించలేము. కావున వెనుకబడిన కులాల్లో అసమానతలు తొలగించే బాధ్యత పాలకులపై ఉంది. అప్పుడే పరిపూర్ణ ప్రజాస్వామ్యం, సమానత్వం సాధించగలుగుతాం అని మండల్ కమీషన్ చెప్పింది."

**రిజర్వేషన్ల వ్యతిరేక పేరుతో చేస్తున్న చర్యలు ఉగ్రవాద చర్యలు కావా?**

రిజర్వేషన్స్ వ్యతిరేక ఆందోళన కారులు దాడులు చేయడం, బస్సులు తగలబెట్టడం లాంటి చర్యలు ఉగ్రవాద చర్యలు కావా? ఇటువంటి చర్యలతో వీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనుకోవడం ఏ రకంగా సరైనది?

## ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు

ప్రభుత్వ రంగం రోజురోజుకి కుదించుకు పోతున్న పరిస్థితుల్లో రాజ్యాంగంలో పేర్కొన్న రిజర్వేషన్లకు విలువ లేకుండా పోతున్నది. కనుకనే అట్టడుగు కులాల వారికి సామాజిక న్యాయం దక్కాలంటే ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేస్తున్నది.

దేశంలో మేధావులు, దళిత సంఘాలు ఇదే డిమాండ్లను చేస్తున్నాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి డిమాండ్లను పట్టించుకోవడంలేదు.

## ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కావాలనే వారి వాదనలు

(1) ప్రయివేటు రంగంలో వస్తున్న పరిశ్రమలలో పెట్టుబడి 10 శాతం కూడా పెటుబడిదారుడు పెట్టడం లేదు. మిగిలిన పెట్టుబడంతా బ్యాంకుల నుండి తెస్తున్న అప్పే గదా. బ్యాంకులో డబ్బు అంటే ప్రజల డబ్బే కదా. అటువంటప్పుడు రిజర్వేషన్లు కల్పించడం సరియైనదే.

(2) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. పరిశ్రమలకు

కావాల్సిన భూమి, నీరు, విద్యుత్, రవాణా మొదలగు సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తుంది. అటువంటప్పుడు రిజర్వేషన్లు కల్పించాలి కదా.

(3) పెట్టుబడిదారులు పరిశ్రమలు స్థాపించి షేర్‌మార్కెట్లో షేర్లను అమ్ముతున్నారు. అంటే ప్రజల పెట్టుబడి వందల, వేల కోట్లలో రాబడుతున్నారు. కానీ లాభాలు మాత్రం యాజమాన్యం కాజేయడం లేదా? అటువంటప్పుడు రిజర్వేషన్లు కల్పించకపోవడంలో అర్థమేమిటి?

(4) వివక్ష ఉన్నంతవరకు రిజర్వేషన్లు కొనసాగించాలి.

(5) అగ్ర కులాల వారికే సామర్థ్యం ఉంటే ప్రతి సంవత్సరం వేలాది పరిశ్రమలు ఎందుకు మూతపడుతున్నాయి. పరిశ్రమలున్నది అగ్ర కులాలవారి చేతుల్లోనే కదా.

(6) సామాజిక న్యాయం కల్పించాలంటే రిజర్వేషన్లు తప్పనిసరి.

(7) మనదేశంలో ప్రజాస్వామ్యం అభివృద్ధి కావాలన్నా, తద్వారా సమానత్వం సాధించాలన్నా అసమానతలు పోవాలి. అందుకు రిజర్వేషన్లు అనివార్యం.

**రిజర్వేషన్ వ్యతిరేక వాదనలు**

(1) రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల సామర్థ్యం దెబ్బతింటుంది. దీనివల్ల ప్రమాణాలు దెబ్బతింటాయి.

(2) సమర్థవంతంగా పనిచేసేవారు కూడా పనిచేయరు.

(3) అసమర్థులకు ఉద్యోగాలు ఇస్తే సమర్థులు వలస వెళ్తారు.

(4) వివిధ కులాల మధ్య అంతరంగాలు పెరిగిపోతాయి. వైవిధ్యం పెరుగుతుంది.

(5) రిజర్వేషన్లు అట్టడుగు కులాల్లోనే సంపన్నులకు ఉపయోగపడతాయి.

(6) ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల విదేశీ సంస్థలతో పోటీ పడలేవు. దీనివల్ల ప్రయివేటు రంగం దెబ్బతింటుంది. దీనితో విదేశీ పెట్టుబడులు రావు.

(7) రిజర్వేషన్లు అమలు చేయడం కన్నా చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులిచ్చి ప్రోత్సహించడం మంచిది.

(8) వృత్తి శిక్షణ, స్కూల్సు నిర్వహించి వారి కాళ్ళపై వారు నిలబడేట్టు చేయాలి.

(9) రిజర్వేషన్లకు ఆర్థిక ప్రాతిపదిక ఉండాలి తప్ప కులం ప్రాతిపదిక కారాదు.

(10) మార్కెట్ పోటీలో నిలబడటం ద్వారానే వివక్షను నిర్మూలించగల్గుతాం.

**మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి**

**మహిళలకు వాటా ఇస్తున్నామా లేదా కోటాగా కల్పిస్తున్నామా**

సమాజంలో మహిళలు కూడా బాగా వెనుకబడి ఉన్నారు. మండల్ కమీషన్ మహిళల వెనుకబాటుతనం గూర్చి వ్యాఖ్యానిస్తూ సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడి

ఉన్నారు. కాబట్టీ వీరిని బిసిలుగా గుర్తించమని ప్రభుత్వానికి సూచించింది.

జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాలలో వివక్షకు గురౌతున్నారు. వీరికి ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. కానీ రాజకీయ రంగంలో, చట్ట సభలలో వీరికి రిజర్వేషన్లు కల్పించడానికి వామపక్షాలు మినహా అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కావున మహిళా సంఘాలు, వామపక్షాలు కోరుతున్నట్లుగా వీరికి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

**ఇబిసి వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలి :**

(1) అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన కులాల్లోని విద్యార్థులకు విద్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

(2) 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వకూడదన్న నిబంధనను సడలించాలి. అప్పుడు మాత్రమే ఇబిసి తరగతులకు 10 శాతం రిజర్వేషన్ అమలు సులభం అవుతుంది.

(3) గతంలో అగ్రకుల బ్రాహ్మణులను ఎస్సీ కులాల్లో చేర్చమని బ్రాహ్మణ సంఘం కోరింది. కొన్ని బిసి కులాలు, రజక కులస్థులు వారిని ఎస్సీ కులంలో చేర్చమని, అగ్నికుల క్షత్రియులు ఎస్టీ కులంలో చేర్చమని డిమాండ్ చేస్తున్నారు. కమీషన్ వేసి నిర్ధారించకుండా కులాల్లో మార్పులు తీసుకురాగూడదు.

దేశంలో అట్టడుగు వర్గాల కోసం, పేదరిక నిర్మూలన కోసం పోరాడుతున్న మనం అట్టడుగు వర్గాల్లో ఐక్యతకు కృషి చేయాలి. అర్హులైనవారికి రిజర్వేషన్లు అమలుజేస్తూనే సామాజిక న్యాయంకై పాటుపడాలి. రిజర్వేషన్లు కేవలం తాత్కాలిక ఉపశమనంగా చూడాలి తప్ప శాశ్వత పరిష్కారంగా చూడరాదు. కావున విశాల ప్రతిపదికపై విద్యార్థి, యువకులను సమీకరించి ఐక్యతకు కృషి చేయాలి.

**ప్రపంచీకరణ - ప్రయివేటీకరణ వల్ల తగ్గిపోతున్న ఉద్యోగాలు :**

(1) ప్రపంచీకరణలో భాగంగా సరళీకరణ విధానాల అమలు వల్ల ప్రభుత్వ రంగాన్ని రోజురోజుకీ ప్రయివేటీకరణ చేస్తున్నారు. నూతన పరిశ్రమలన్నీ ప్రయివేటు రంగంలోనే నెలకొల్పుతున్నారు. దీనివల్ల రిజర్వేషన్లు అమలు కావు. చట్టంలో రిజర్వేషన్లు ఉన్నా ప్రయివేటీకరణ వల్ల ఉపయోగం లేకుండా పోతున్నాయి. కనుక ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడానికి పోరాడాలి.

(2) ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వడం లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తున్నారు. ఇందులో రిజర్వేషన్లు లేవు. కనుక పేరుకు ఉపాధి కల్పిస్తున్నా రిజర్వేషన్లు అమలు చేయకుండా అట్టడుగు వర్గాలకు పాలకవర్గం అన్యాయం చేస్తున్నది.

(3) ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో యాంత్రీకరణ వేగంగా అమలు జరుపుతున్నారు. కంప్యూటరైజేషన్ పెరిగింది. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్లు

కుదించుకుపోతున్నాయి.

(4) అందరికీ విద్య, ఉద్యోగం కల్పించాలనే డిమాండును విస్తృతంగా ప్రచారం చేయాలి.

ఈ రోజు విద్య ప్రయివేటీకరణ వేగంగా జరుగుతున్నది. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. హాస్టల్స్ కూడా మూతపడుతున్నాయి. దళితులకు వెనుకబడిన తరగతుల ప్రజలకు విద్య అందుబాటులో లేకుండా పోతున్నది. కావున ప్రభుత్వం అందరికీ విద్యనందించే విధంగా చర్యలు తీసుకునేటట్టు మనం పోరాడాలి.

ఉద్యోగాలు రోజురోజుకి తగ్గిపోతున్న పరిస్థితుల్లో నిరుద్యోగం వేగవంతంగా పెరుగుతున్నది. చదువుకున్న నిరుద్యోగులు చేయడానికి పనిలేక అనేక ప్రక్కదార్లు పడుతున్నారు. అసాంఘీక కార్యక్రమాలలో భాగస్వాములవుతున్నారు. కావున చదువుకున్న నిరుద్యోగులందరికీ ఉపాది,, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అంతవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

రాజ్యాంగ చట్టాన్ని ఆమోదించిన తర్వాత పార్లమెంటులో డా॥ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ఈ క్రింది విధంగా చెబుతారు. "మన మనదేశంలోని వయోజనులైన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. ఒకే ఓటు, ఒకే విలువ సూత్రాన్ని ఆమోదించింది. కానీ మనదేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు కొనసాగుతున్నాయి. మన దేశాన్ని పాలిస్తున్న పాలకవర్గం ఈ అసమానతలను రూపుమాపడానికి కృషి చేయాలి. ఈ అసమానతలు నిర్మూలించకపోతే మనం నిర్మించిన ఈ ప్రజాస్వామ్య సౌధాన్ని నా ప్రజలు కూల్చి వేస్తారు." అని ఆయన హెచ్చరించారు.

ఆనాడు అంబేద్కర్ ఏ హెచ్చరికనైతే చేశారో ఆ అసమానతలు కొనసాగడమే కాదు మరింత తీవ్రమౌతున్నాయి. ఈ అసమానతలకు నూతన ఆర్థిక విధానాలు మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు తప్పనిసరిగా కల్పించాలి.

## కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం వైఖరి

మన దేశంలో ఫ్యూడల్ వ్యవస్థలో కులాలు ఆవిర్భవించాయి. అట్టడుగు కులాలు సామాజికంగా ముందుకు పోవాలన్నా ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా భూ పంపిణీ జరగాలి. దున్నేవానికే భూమి దక్కాలి. శ్రమ జీవులకు కనీస వేతనాలు అమలు చేయడం ద్వారా వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కాలి. వారి వెనుకబాటు తనాన్ని అధిగమించడానికి విద్యారంగంపై అధికంగా నిధులు ఖర్చు చేసి, విద్యార్థుల శాతం పెంచాలి. అర్హులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. తద్వారా సామాజిక న్యాయం అందించాలి.

కుల వివక్ష వ్యతిరేక పోరాటాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు కలగలిపి నిర్వహించడం ద్వారా మాత్రమే అట్టడుగు వర్గాల్లో ఐక్యత సాధించగల్గుతాం. సామాజిక,

ఆర్థిక  వెనుకబాటు తొలగేవరకు అట్టడుగు కులాలకు రిజర్వేషన్లు  అవసరమవుతాయి.

**అగ్రకులాల్లోని మేధావులు అనేకమంది రిజర్వేషన్లు అవసరం తీరిపోయిందని,** రిజర్వేషన్లు రద్దు చేయాలని చెబుతున్నారు. ఇది వాస్తవ విరుద్ధం. రిజర్వేషన్లు అమలయిన తరువాత కేవలం 2% మాత్రమే. దళితులు లబ్ది పొందారు.

**రిజర్వేషన్లు శాశ్వతంగా అమలు చేయాలా?** రిజర్వేషన్లు కేవలం తాత్కాలిక ఉ పశమనం మాత్రమే.  రిజర్వేషన్ల ద్వారానే అట్టడుగు కులాల ప్రజలను అభివృద్ధి చేయలేం. అట్టడుగు కులాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే వ్యవస్థ మార్పుకు కృషిచేయాలి. ఎవరైతే కష్టపడి పనిచేస్తున్నారో, సంపదను సృష్టిస్తున్నారో ఆ సంపద పరాన్న భుక్కులకు చెందకుండా శ్రమజీవులకు చెందే వ్యవస్థ ఏర్పడిన రోజన  రిజర్వేషన్ల అవసరమే ఉండదు. వివిధ కులాల్లోని శ్రమజీవులు పై ఆశయం కోసం పోరాడకుండా మా కులానికి రిజర్వేషన్లంటే మా కులానికి రిజర్వేషన్లు అని ఒక కులంపై మరొక కులం కత్తులు దూస్తున్నారు. పాలకవర్గం కులాల కుంపట్లను రెచ్చగొడుతున్నది. కావున మనం పాలకవర్గం ఉచ్చులో పడకుండా వర్గ దృక్పథంతో సమస్యను పరిశీలించాలి.

మిత్రులారా! రోజురోజుకి ప్రభుత్వ రంగం కుదించుకుపోతున్నది. ప్రైవేటు రంగం అభివృద్ధి చెందుతున్నది. దీని వలన రాజ్యాంగంలో ఉన్న రిజర్వేషన్లు అమలుకు నోచుకోవడం లేదు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించినపుడు మాత్రమే దళిత, గిరిజనులకు, వెనుక బడిన తరగతుల వారికి న్యాయం జరుగుతుంది. కావున దళిత, గిరిజనులు బాబా సాహెబ్ డా॥ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు పూర్తిగా అమలు కావాలంటే దళిత, గిరిజనుల మధ్య ఎటువంటి విభేధాలు లేకుండా ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మనం పోరాడాల్సి ఉంది.

ఇందుకోసం దేశ వ్యాప్తంగా దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డి.ఎస్.ఎమ్.ఎమ్.), రాష్ట్రంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) చేస్తున్న కృషికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాము.

మన రాష్ట్రంలో దళిత, గిరిజన సంఘాలతో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధన కొరకు విస్తృత ప్రాతిపదికపై కార్యాచరణ కమిటి ఏర్పడింది.  కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని రిజర్వేషన్ల సాధన పోరాట కమిటి పేరుతో జరుగుతున్న ఉద్యమంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.